క్లుప్తంగా

నేడు అయ్యప్పస్వామి నగర బాట



మండపేట: అయ్యప్ప సేవా సమితి, భక్తబృందం సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం అయ్యప్ప స్వామి నగరబాట నిర్వహించనున్నారు. ఉదయం అయ్యప్ప ఆలయం వద్ద గణపతి హోమం, మాలిగ పురత్తమ్మకు కుంకుమ పూజ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆలయం వద్ద నుంచి స్వామివారి రథయాత్ర ప్రారంభం అవుతుంది. అయ్యప్ప మాలధారుల దేవతామూర్తుల వేషధారణలతో ఈ యాత్ర సాగుతుంది. సాయంత్రం స్వామి వారికి పుష్పాభిషేకం అనంతరం రాత్రికి ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్య నంబూద్రి ఆధ్వర్యంలో ఆలయం వద్ద 18 మెట్లకు పడిపూజ జరుగుతుంది. అధిక సంఖ్యలో మాలధారులు పాల్గొని నగరబాటను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ప్రజాస్వామ్యానికి పత్రికలే వెన్నెముక

కాజులూరు: ప్రజాస్వామ్యానికి పత్రికలే వెన్నెముక అని, ఒక దేశ పత్రికారంగాన్ని పరిశీలిస్తే ఆ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ అవగాహన అవుతుందని అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ వనుం శ్రీనివాస్ అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని గొల్లపాలెం అలయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు, గ్రామ ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి ఆధ్వర్యంలో శనివారం పాఠశాలలో విద్యార్థులకు పత్రికారంగంపై అవగాహన కార్యక్రమాలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 1966 నవంబరు 16వ తేదీన ఏర్పాటు చేసినప్పటి నుంచి ప్రతి ఏటా ఈ రోజున జాతీయ పత్రికా దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. క్లబ్ సభ్యులు విద్యార్థులకు పత్రికారంగం, ప్రజాస్వామ్యం అనే అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆలయాల భూముల ఆక్రమణపై సమీక్ష



ఈవోలతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా దేవదయాధికారి సత్యనారాయణ

రామచంద్రపురం: జిల్లా దేవాదాయశాఖ అధికారి వి.సత్యనారాయణ రామచంద్రపురం దేవదాయ శాఖ తనిఖీదారు కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో దేవాలయాల భూములు, పట్టాదారు పుస్తకాలు, భూముల ఆక్రమణలపై చర్చలు, సీజీఎఫ్, ఈఏఎఫ్ చెల్లింపులపై ఈవోలతో సమీక్ష చేశారు. అనంతరం వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తనిఖీదారులు బాలాజి రామ్ ప్రసాద్, కొత్తపేట, రామచంద్రపురం డివిజన్ల ఆలయాల కార్యనిర్వహణాధికారులు, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యురాలికి పతి వియోగం



పలివెల సతీష్ (ఫైల్)

రాయవరం: మాచవరం ఎంపీటీసీ సభ్యురాలు పలివెల శోభనకు పతీ వియోగం కలిగింది. శోభన భర్త పలివెల సతీష్ (37) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆరు గంటల సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే సతీష్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని కుటుంబ సభ్యులు తెలిపారు. సతీష్‌కు కుమార్తె, కుమారుడు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే ఎంపీపీ నాడు వెంకటరమణ, సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ నేతలు ముగ్గళ్ల సూర్యం, నీలం తాతాజీ, మేడపాటి శేషాలు తదితరులు మృతదేహానికి నివాళులర్పించి, సానుభూతి వ్యక్తం చేశారు.

సాంకేతికత సమస్యలకు మూలం కారాదు

కపిలేశ్వరపురం: సమస్యలకు ఆధునిక శాస్త్రీయ, సాంకేతికత మూలం కారాదని, మొబైల్, సామాజిక మాధ్యమాల వినియోగంపై అవగాహన అవసరమని అంగర ఎస్సై డి.రవికుమార్ అన్నారు. అంగర పోలీస్ స్టేషన్ పరిధిలోని టేకి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మహిళా సంరక్షణపై అవగాహన కల్పించారు. ఎస్సై రవికుమార్ మాట్లాడుతూ సమాజంలోని అంతరాలు మహిళల పట్ల చిన్నచూపునకు దారి తీస్తుందన్నారు. దానికితోడు సామాజిక మాధ్యమాల దుర్వినియోగం మహిళలపై నేరాలకు కారణమవుతున్నాయన్నారు. వాటి పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మండలంలోని మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘వరి’వడిగా..

- ఊపందుకున్న ఖరీఫ్ పంట ఒబ్బిడి
- ఒక్కసారిగా పెరిగిన కూలి రేట్లు
- 75 శాతం పంట కోత ప్రయోగాలు పూర్తి



పంట కోత ప్రయోగం చేస్తున్న అధికారులు

రాయవరం: తుపాను ముప్పు తప్పడంతో ఊపిరి పీల్చుకున్న అన్నదాతలు వరి కోతలు, పంట నూర్పిళ్లపై దృష్టి సారించారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో అన్నదాతలు ఎక్కడికక్కడ వరి కోతలను ముమ్మరం చేశారు. బోర్లపై సాగు చేసిన పంట పక్వానికి రావడంతో అమావాస్యకు ముందే వరి కోతలు చేపట్టారు. ఆలస్యంగా నాట్లు వేసిన పొలాలు సైతం కోతలకు రావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు.

పూర్తిగా వరి కోత యంత్రాలపైనే

ఈశాన్య రుతుపవనాల ప్రభావం ఖరీఫ్‌పై చూపించక ముందే పండిన పంటను ఒబ్బిడి చేసుకోవాలన్న ఆతృతతో పలువురు రైతులు వరికోత యంత్రాల సాయంతో వరికోతలు కోస్తున్నారు. సాధారణంగా రబీలోనే ఎక్కువగా వరికోతలు యంత్రాలపై చేపట్టేవారు. ఇటీవల ఖరీఫ్‌లో కూడా యంత్రాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వరికోత యంత్రానికి గంటకు రూ.2,800 నుంచి రూ.3 వేల వరకూ చెల్లిస్తున్నారు. దీంతో ఇప్పటికే వరికోత యంత్రాలు పంట పొలాలకు చేరుకోగా, డిమాండ్ పెరగడంతో మరిన్ని వస్తున్నాయి. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలోని 1.01 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి నాట్లు వేశారు. 80 శాతం మేర స్వర్ణ రకాన్ని సాగు చేయగా మిగిలిన 20 శాతం విస్తీర్ణంలో



యంత్రాలతో వరి కోతలు

ఎంటీయూ 1,318, ఎంటీయూ 3626 (బొండాలు) తదితర రకాల వంగడాలను సాగు చేశారు.

పంట కోత ప్రయోగాలు

దిగుబడి ఏ విధంగా ఉందన్న విషయాన్ని తెలుసుకునేందుకు నిర్వహించే పంట కోత ప్రయోగాలు కూడా చురుగ్గా సాగుతున్నాయి. క్లస్టర్ పరిధిలో సుమారు 225 పంట కోత ప్రయోగాలు నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటి వరకూ 160 ప్రయోగాలు పూర్తయ్యాయి. పంటకోత ప్రయోగాల్లో సైతం దిగుబడి 30–35 బస్తాలే వస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

పెరిగిన కూలి రేట్లు

వాతావరణం అనుకూలించడంతో అందరూ ఒక్కసారిగా వరి కోతలు ప్రారంభించడంతో కూలి రేట్లు పెరిగాయి. పురుషులకు ఒక్కొక్కరికి రూ.800 చెల్లిస్తుండగా, మహిళా కూలీలకు ఒక్కొక్కరికి రూ.600 చొప్పున చెల్లిస్తున్నారు. సాధారణంగా ఎకరా వరి చేను కోయడానికి ఆరుగురు కూలీలు అవసరం అవుతారు. అయితే గత వర్షాలకు నేల నంటిన వరి చేలను కూలీలతోనే కోత కోయించాల్సి ఉండడంతో తొమ్మిది మంది వరకూ కూలీలు అవసరం అవుతున్నట్టు రైతులు చెబుతున్నారు.

యంత్రాలతోనే సులువు



వరికోతలు యంత్రాలతో కోయడం సులువుగా ఉంటుంది. కూలీల కొరత నేపథ్యంలో యంత్రాల వినియోగం తప్పనిసరి అవుతుంది. దిగుబడులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఖరీఫ్ నిరాశకు గురి చేసింది. రబీపైనే ఆశలు పెట్టుకున్నాం.

– కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, పసలపూడి, రాయవరం మండలం

ముమ్మరంగా వరికోతలు



వాతావరణం అనుకూలించడం, అమావాస్య వెళ్లడంతో రైతులు వరికోతలు చురుగ్గా చేపట్టారు. ఇప్పటికే మండలంలో 45 శాతం మేర కోతలు చేపట్టారు. వాతావరణం అనుకూలించడంతో ఈ నెలాఖరుకు వరి కోతలు పూర్తవుతాయి.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

కన్నుల పండువగా జ్వాలాతోరణం



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో జ్వాలాతోరణ ఉత్సవంలో భక్తులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో కార్తిక మాసంలో కృత్తికా నక్షత్రంలో నిర్వహించే జ్వాలా తోరణం కార్యక్రమం శనివారం రాత్రి ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయంలో అఖండ దీపారాధన, ప్రదక్షిణలు నిర్వహించి పాక శాసన స్వామి ఆలయం వద్ద ఆస్థాన పూజ చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వరి గడ్డితో ఏర్పాటు చేసిన జ్వాలా తోరణానికి పల్లకి ప్రదక్షిణలు చేసి తోరణానికి నిప్పు పెట్టారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, భక్తులు పాల్గొన్నారు.

హోమియోతో వ్యాధులకు శాశ్వత పరిష్కారం



రోగికి హోమియో మందు వేస్తున్న అతిథులు

మండపేట: హోమియో వైద్యంతో కొన్ని రోగాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ సత్తి రామకృష్ణారెడ్డి, విశాఖ కనక మహాలక్ష్మి ఆలయ కమిటీ సభ్యుడు చిర్ల సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అర్తమూరులో ఎస్‌బీఏ స్టార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం 177వ ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరాన్ని వారిద్దరూ ప్రారంభించారు. రాజమహేంద్రవరంలోని అల్లు రామలింగయ్య హోమియో ఆసుపత్రి వైద్యులు విమల, వెంకటేష్, తేజస్వి, వీరభద్రరావు హాజరైన రోగులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న రాయవరం వైద్యురాలు పద్మావతి మాట్లాడుతూ అన్ని రకాల హోమియో మందులతో ట్రస్టు ద్వారా ఉచితంగా వైద్యం అందించడం అభినందనీయమన్నారు. చుట్టుపక్కల 13 గ్రామాల నుంచి వచ్చిన 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు బులిస్వామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తాడి సుబ్బారెడ్డి, ఓగిరెడ్డి రామారెడ్డి, తాడి శ్రీనివాస రెడ్డి, చిర్ల రామకృష్ణారెడ్డి, చింతా వెంకటకృష్ణారెడ్డి, ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి, కేబీఎస్ఎన్ రాజు, వెలగల శివారెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, జీవీఎస్ఎన్ మూర్తి, తాడి రామారెడ్డి, కొవ్వూరి గంగిరెడ్డి, హేమలత పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో క్యాన్సర్ పరీక్షలు



అంగరలో క్యాన్సర్ వ్యాధి లక్షణాలను వివరిస్తున్న ఎంపీహెచ్ఈఓ మల్లికార్జున్

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో వైద్యాధికారి పి.రత్నకుమారి ఆధ్వర్యంలో అందరికీ క్యాన్సర్ పరీక్షల కార్యక్రమం చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి క్యాన్సర్ లక్షణాల ఆధారంగా పరీక్షించారు. అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల్లోఎంపీహెచ్ఈఓ జిత్తుగ మల్లికార్జునుడు, హెచ్ఈ బి.రామారావు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన ప్రజలందరినీ పరీక్షిస్తున్నామన్నారు. క్యాన్సర్ వ్యాధి కారకాలు, లక్షణాలుపై అవగాహన కల్పించారు. లక్షణాలున్నవారిని వైద్యాధికారి స్థాయిలో మరోసారి పరీక్షించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ



అంగర పంచాయతీ కార్యాలయంలో విచారణ జరుపుతున్న ఐదం రాజు

కపిలేశ్వరపురం: 2021 ఏప్రిల్ నుంచి 2024 సెప్టెంబర్ మధ్య అంగర పంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయంటూ ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు ఇచ్చిన ఫిర్యాదుపై ఇన్‌చార్జి డీఎల్‌పీఓ ఐదం రాజు శనివారం విచారణ జరిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.80 లక్షలు, పంచాయతీ ఆదాయం రూ.కోటి, గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో గత ప్రభుత్వం ఇచ్చిన రూ.40 లక్షలు నిధుల వినియోగంలో పంచాయతీ అధికారితో కలిసి సర్పంచ్ వాసా కోటేశ్వరరావు అవకతవకలకు పాల్పడినట్టు వీరన్నబాబు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ఐదం రాజు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుదారు వీరన్నబాబు నుంచి వివరాలను సేకరించారు. ప్రాథమిక విచారణ అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డీఎల్‌పీఓ రాజు తెలిపారు.

అసమానతల్లేని సమాజం కోసం పోరాడాలి



చంద్ర పుల్లారెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రామచంద్రపురం రూరల్: అమరవీరుల స్ఫూర్తితో సమాజంలోని అసమానతలు రూపుమాపేలా పోరాటాలకు ప్రజలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని ద్రాక్షారామ గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయం వద్ద అమర వీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీకట్ల వెంకటేశ్వరరావు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ గోదావరి లోయ ప్రతిఘటన పోరాట యోధుడు చంద్ర పుల్లారెడ్డి తదితర అమర వీరుల స్ఫూర్తిగా భూమి, భుక్తి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం ప్రజా సంఘాలు నిర్వహించే ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేఖ, కార్మిక వ్యతిరేఖ విధానాలతో ముందుకు సాగుతున్నాయన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల వల్ల స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులు దేశ సంపదను దోచుకుంటున్నారన్నారు. ప్రజల కోసం పోరాడుతున్న ప్రగతిశీల శక్తులపై, అభ్యుదయవాదులపై తప్పుడు కేసులు పెట్టి నిర్బంధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరుల స్ఫూర్తితో పోరాడినప్పుడే వారికి నిజమైన నివాళి ఇచ్చినట్లు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చింతా రాజారెడ్డి, అంబటి కృష్ణ, వెంటపల్లి రామకృష్ణ, చల్లపూడి పట్టాభిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా...



వాకతిప్పలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కపిలేశ్వరపురం: విద్యార్థుల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి పి.చంద్రమౌళి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని విద్యాలయాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని మూడు ఉన్నత, 10 ప్రాథమిక పాఠశాలలు, 22 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 1,489 మంది చిన్నారులకు 4 డీ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వాసంతి, ఎంపీహెచ్ఈఓ పీడీడీ బిషప్, ఎంపీహెచ్ఎస్ కామేశ్వరరావు, ఏఎన్ఎం సత్యవతి, వైద్య, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను ప్రోత్సహించాలి



రామచంద్రపురంలో మాట్లాడుతున్న రవిబాబు



కాజులూరు గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



కపిలేశ్వరపురం గ్రంథాలయంలో వ్యాస రచన పోటీలో విద్యార్థులు



ద్రాక్షారామలో విద్యార్థులకు పుస్తక పఠనం గురించి వివరిస్తున్న కంప్యూటర్ టీచర్ రాజశేఖర్

కాజులూరు: రోజు రోజుకీ గ్రంథాలయాలకు ఆదరన తగ్గుతోందని, ప్రభుత్వాలు, ప్రజలు వాటిని పోత్సహించాల్సిన అవసరం ఎంతైన ఉందని కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. కాజులూరులో గత మూడు రోజులుగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. శనివారం స్థానిక గ్రంథాలయాధికారి కె.ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరు నాగభూషణం తదితరులు గ్రంథాలయాలకు చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. అనంతరం మాదక ద్రవ్యాల ఉపయోగం వలన కలిగే అనర్థాలపై వ్యసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మండలంలో వివిధ పాఠశాలలకు చెందిన 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

రామచంద్రపురం: పాఠశాల స్థాయి నుంచే తమకు ఇష్టమైన రంగంలో ప్రతిభను కనబరుస్తూ ఎవరికి వారు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు కొండేపూడి రవిబాబు విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 102 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవిబాబు మాట్లాడుతూ గ్రంథాలయ ఉనికి, ఉపయోగాల గురించి వివరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మక ప్రజ్ఞ గురించి వివరించారు. ఎం.రాజేంద్ర విద్యార్థులకు అల్పాహారాన్ని అందజేశారు. గ్రంథాలయ పాలకులు దడాల వెంకటరమణ, ఎన్.వనజాక్షి, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ శాఖ గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు గ్రంథాలయాల వల్ల ఉపయోగాలు, వాటిని సద్వినియోగం చేసుకునే విధానాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కంప్యూటర్ టీచర్ ఆర్‌కే రాజశేఖర్ మాట్లాడుతూ సాంకేతిక ఎంత అభివృద్ధి చెందినా పుస్తక పఠనానికి సాటి రావన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ నెల 20వ తేదీన బహుమతి ప్రదానం చేయనున్నట్ట తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

మండపేట: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండపేట శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎస్. పూర్ణమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. స్థానిక ఏడిద రోడ్డులోని వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీల్లో 40 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ ఉద్యమంలో శ్రమించిన ప్రముఖులు సీఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంటరమణయ్యల సేవలను తొలుత స్మరించుకున్నారు. ఉపాధ్యాయుడు జీవీవీ సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని తన సందేశాన్ని వినిపించారు. ‘నాకు నచ్చిన పుస్తకం’ అనే అంశంపై పోటీలు నిర్వహించినట్టు పూర్ణమ్మ తెలిపారు.

రాయవరం: మాచవరం శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, గ్రంథాలయ ఉద్యమ నేత అయ్యంకి వెంకటరమణయ్య, గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ తదితరుల చిత్ర పటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ టి.ప్రమీల, రిటైర్డ్ హెచ్‌ఎం మేడపాటి నారాయణరెడ్డి, మెయిన్ స్కూల్ హెచ్‌ఎం సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురం గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి ఆధ్వర్యంలో జూనియర్స్ విభాగంలో గ్రంథాలయాలు–వాటి ఉపయోగాలు’ సీనియర్స్ విభాగంలో ‘పుస్తక పఠనం– ఆవశ్యకత ’ అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణ్యలు సాహిత్య రంగంలో చేసిన కృషిని వివరించారు.

వేంకటేశ్వర స్వామికి పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు విశేష పూజలు చేశారు. రామచంద్రపురానికి చెందిన చవాకుల నాగవీరవెంకట సత్యనారాయణ, దుర్గా వైష్ణవి దంపతుల కుమార్తె షణ్ముఖ, అనపర్తికి చెందిన చిట్టూరి శివశంకర, ఈశ్వరి ప్రియా దంపతుల కుమార్తెలకు పటికతో తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నారు. భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు.

పోర్టుఫోలియో జడ్జిని కలిసిన న్యాయవాదులు



పోర్టుఫోలియో జడ్జి జయ సూర్యను కలిసిన న్యాయవాదులు

రామచంద్రపురం: రాష్ట్ర హైకోర్టు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ నయనాల జయసూర్యను శనివారం స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కలిశారు. ద్రాక్షారామ భీమేశ్వరస్వామి వారి దర్శనార్థం వెళుతున్న హైకోర్టు న్యాయమూర్తి రామచంద్రపురంలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పిల్లి మురళీ మోహన్ వెంకటరమణ, సాయి ప్రసాద్ వాడ్రేవుల ఆధ్వర్యంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల రామచంద్రపురానికి అదనపు జిల్లా కోర్టు మంజూరైన సంగతి విదితమే. ఈ కోర్టు ప్రారంభోత్సవ తేదీ కోసం ఆయనను సంప్రదించారు. త్వరలోనే ప్రారంభ తేదీని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తెలియ చేస్తుందని న్యాయమూర్తి చెప్పారు. తొలుత ఆయనకు స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జడ్జిలు నిజామ్ శారద, వి.నాగేశ్వరరావు నాయక్ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డీఎస్ఎస్ శర్మ, పలివెల సత్యనారాయణ, సహ కార్యదర్శి వీరెడ్డి, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్ల పృథ్వీ, న్యాయవాదులు డపీ శాస్త్రి, బుద్ధవరపు సూర్యనారాయణ, హైకోర్టు న్యాయవాది కె.అప్పారావు, స్థానిక సీనియర్ న్యాయవాదులు పి. సంపత్ రావు, వాకలపూడి జయశంకర్, బులుసు వెంకటేశ్వరరావు గాలింకి చిట్టిబాబు, దొమ్మల పాటి సత్యనారాయణ, వనితా తదితరులు పాల్గొన్నారు.

మండపేటను ‘తూర్పు’ లో విలీనం చేయాలి

మండపేట: మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలంటూ శాసనసభలో ప్రభుత్వాన్ని కోరిన స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కృషి అభినందనీయమని మండపేట జేఏసీ నాయకులు కామన ప్రభాకరరావు, కోన సత్యనారాయణ, దూలి జయరాజు అన్నారు. శనివారం ఏడిదలోని కామన నివాసంలో వారు మీడియాతో మాట్లాడారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా మండపేట నియోజక వర్గాన్ని అమలాపురం పార్లమెంట్‌లో కలపడం వల్ల ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందుల ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు.

ఐక్యతకు వారధిగా వన సమారాధనలు



రాయవరం సబ్‌స్టేషన్ వద్ద వన సమారాధనలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ రాజబాబు తదితరులు

రాయవరం: కార్తిక వన సమారాధనలు ఐక్యతకు వారధిగా నిలుస్తాయని ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ ఎస్.రాజబాబు పేర్కొన్నారు. రాయవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ రాజబాబు మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాల్లో కార్తిక వన సమారాధన ఒక భాగమన్నారు. కార్తిక వన సమారాధన ద్వారా వృక్షాల ప్రాధాన్యతను, సమాజంలో అందరూ ఒక్కటేనన్న భావనను పెంపొదిస్తాయన్నారు. తొలుతగా ఎస్ఈ రాజబాబు, ఈఈ కె.రత్నాలరావు, డీఈఈ సీహెచ్ శ్రీధర్, ఏఈ నందక శ్రీనివాసు, రాజమహేంద్రవరం రూరల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ, అనపర్తి సబ్ డివిజనల్ ఇంజినీర్ నిరంజన్‌బాబు తదితరులతో కలసి ఆయన ఉసిరి చెట్టు వద్ద కార్తీక దామోదరుడికి పూజలు నిర్వహించారు. అనంతరం ఉద్యోగులు, కుటుంబ సభ్యులతో కలిసి కార్తీక వన సమారాధనలో భాగంగా సహపంక్తి భోజనాలు చేశారు.

అంగర సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో..

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఆలయంలో అర్చకులు దేవతామూర్తులకు విశేష పూజలు చేశారు. ఉసిరి చెట్టు వద్ద అంగర, పడమర ఖండ్రిక గ్రామాల పుణ్య దంపతులు పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన వన భోజనాల్లో ఇరు గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.